హైదరాబాద్ వార్త



# కల్తీపై నిఘా ఏదీ?

**-హోటల్ వంటకాల్లో కల్తీనూనె వాడకం**
**-పట్టించుకోని ఆహార కల్తీ నిరోధక శాఖ**
**-ఫిర్యాదులొస్తే మొక్కుబడిగా తనిఖీలు**
**-రోగాల బారిన పడుతున్న ప్రజలు**



నాగోల్ పరిధిలోని హోటళ్లపై తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త**

ప్రధాన రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, మాంసం దుకాణాలు, ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు ప్రతినెలా విధిగా తనిఖీలు చేయాలి. కానీ ఏదైనా ఘటనలు జరిగిన సమయంలోనే హడావిడి చేసి, తర్వాత పట్టించుకోకపోవడంతో ప్రజల ఆహార భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది.- ప్రధాన హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో వినియోగించే నూనెల్లో ఎక్కువగా కల్తీవి వాడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనికితోడు హోటళ్లు, రెస్టారెంట్లలో వంటగదుల్లో పూర్తి స్థాయిలో పరిశుభ్రత లేకపోవడంపై పరిశీలించే వారు కరువైన పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.- కూరగాయాల విషయంలో కూడా తక్కవ గ్రేడ్ ఉన్నవాటిని కొనుగోలు చేసి వినియోగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వీటిన్నింటిపై తనిఖీలు లేకపోవడంతో పట్టణ, నగర ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.- శివారుల్లో వందల సంఖ్యలో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, మాంసాహార దుకాణాలు, బేకరీలు, మిఠాయి దుకాణాలున్నాయి. వీటి నిర్వాహణపై ఆహార కల్తీ నిరోధకశాఖ నుంచి తప్పకుండా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేసుకుని అనుమతి తీసుకున్న వారి సంఖ్య తక్కువగా ఉంది. కొత్తగా ఏర్పాటు చేస్తున్న వారు అసలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ వసతి గృహాల్లో ఆహార నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపి నివేదికలు సమర్పించాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదు.

**నిబంధనలు గాలికి..**

ఆహార వ్యాపారాలు ఊపందుకున్నాయి. ఇబ్బడి ముబ్బడిగా హోటళ్లు, బిర్యానీ పాయింట్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, బేకరీలు, తినుబండారాల తయారీ కేంద్రాలు వెలిశాయి. ఆహార పదార్థాల తయారీదారులు, విక్రేతలు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) ప్రమాణాలను పాటిస్తూ.. శుభ్రతతో పాటు తాజా సరుకులతో పదార్థాలను తయారు చేయాలి. చాలా కేంద్రాలు ఈ నిబంధనలను గాలికి వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి. పర్యవేక్షణ లోపం ప్రజలకు శాపం..ఆహార భద్రతాధికారి పోస్టులు ఖాళీగా ఉండటంతో పాటు హెల్త్ ఆఫీసర్లు లేకపోవడంతో హోటళ్లు, తిను బండారాల కేంద్రాలు, మాంసం క్రయవిక్రయ కేంద్రాలలోని పదార్థాలపై పర్యవేక్షణ కర వవుతోంది. దీంతో తినుబండారాల తయా రీతో పాటు హోటళ్లు, మాంసం క్రయ విక్రయ కేంద్రాలను నడిపేవారు ఇష్టారా జ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలు రోగా ల బారిన పడుతున్నారు.

**వినియోగదారుల చట్టం ప్రకారం..**

వినియోగదారుల హక్కుల చట్టం ప్రకారం తినుబండారాల తయారీలో శుభ్రత, నాణ్యత విధిగా పాటించాల్సి ఉండగా.. జీహెచ్ఎంసీ పరిధిలోని శివారు మున్సిపల్ సర్కిళ్లలో అమలుకు నోచుకోవడం లేదు. చౌరస్తాలు, పార్కులు, రద్దీ ప్రదేశాలు, బస్ స్టేషన్లు, రైల్వేస్టేషన్ల సమీప ప్రాంతాలతో పాటు హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారి, రాజీవ్ రహదారితో పాటు హైదరాబాద్ - నిజామాబాద్ రహదారి ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపుల ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టీ స్టాళ్లలో పరిశుభ్రత చర్యలు కనిపించడం లేదు. రహదారులపై ఉండే హోటళ్లు నిత్యం రద్దీగా ఉంటున్నాయి. వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి ఆహార పదార్థాలపై పడుతోంది. అయినప్పటికీ నిర్వాహకులు వాటిని విక్రయిస్తున్నారు. ముఖానికి మాస్కులు లేకుండా చేతులకు రక్షణ కవచాలు (తొడుగులు) వేసుకోకుండానే ఆహారపదార్థాలు, తినుబండారాలు తయారుచేస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో నూడుల్స్, ఫ్రైడ్‌రైస్ తయారీ తర్వాత ప్లాస్టిక్ పాత్రలు, కవర్లలో వడ్డిస్తున్నారు. ఆహార పదార్థాలపై ఎలాంటి రక్షణ చర్యలు లేక ఈగలు, దోమలు వాలుతున్నాయి.

# అవకతవకలు నిజమే!

**-కార్వాన్ సర్కిల్‌లో మూసీ డీసిల్టింగ్ టెండర్లపై విచారణ**
**-టెండర్ రద్దు చేసిన జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్**
**-ఈఈ లాల్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్ల డిమాండ్**




**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:** కార్వాన్ సర్కిల్‌లో మూసీ డీసిల్టింగ్ టెండర్‌ను జిహెచ్‌ఎంసి రద్దు చేసింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఆదేశాలమేరకు అవకతవకల ఆరోపణలపై ఉన్నతాధికారుల విచారణ చేశారు. పురానాపూల్ బ్రిడ్జి నుంచి అత్తాపూర్ బ్రిడ్జి వరకు డీసిల్టింగ్ పనులకు టెండర్ విడుదల చేసిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లాల్ సింగ్26 శాతం లెస్ కోట్ చేసిన బిడ్డర్‌ను పక్కనబెట్టి 2 శాతం లెస్ కోట్ చేసిన సంస్థకు టెండర్ కేటాయింపు చేసినట్లు నిర్ధారించారు. దీంతో ఆటెండర్‌ను రద్దుచేస్తున్నట్లు జిహెచ్‌ఎంసి కమిషనర్ ప్రకటించారు. ఈసందర్భగా బాధిత కాంట్రాక్టర్ వరికుప్పల స్వామి మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ జీఓ 66 నిబంధనలకు విరుద్ధంగా టెండర్ షరతులు రూపొందించి అక్రమాలకు పాల్పడుతూతనకు నచ్చిన సంస్థకే టెండర్లు ఇస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లాల్ సింగ్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.కాగా గోలొండ సరిల్ పరిధిలోని షాహాతిమ్ తలాబ్, లంగర్ హౌస్ చెరువులలో పేరుకు పోయిన గుర్రపుడెక, చెత్తను తొలగించేందుకు (టెండర్ ఐడీ 711675 – విలువ రూ. 39,14, 840, మూసీ నది పురానాపూల్ బ్రిడ్జి నుండి అత్తాపూర్ బ్రిడ్జి వరకు గుర్రపుడెకను తొలగించేందుకు (టెండర్ ఐడీ: 711678 – విలువ రూ. 38,66,840) టెండర్లు ఆహ్వానించారు. ఈ పనుల కోసం హిటాచీ మిషన్లను వినియోగించాల్సి ఉండటంతో, కాంట్రాక్టర్ వరికుప్పల స్వామి తన ఏజెన్సీ తరఫున టెండర్లు దాఖలు చేశారు. ఐతే టెండర్ నిబంధనల ప్రకారం వేసినప్పటికీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఎస్ఐ, పిఎఫ్)తక్కువ లేబర్ వ్యయాన్ని సాకుగా చూపుతూ రిజక్ట్ చేశారన్నారు. కాంట్రాక్టర్ తాను ఈఎస్ఐ, పీఎఫ్ వివరాలను సరిగ్గా సమర్పించినప్పటికీ, వాటిని పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా టెండర్లను తిరస్కరించారని తెలిపారు. దీంతో తాము జిహెచ్‌ఎంసి కమిషనర్, ఛీఫ్ విజిలెన్స్ ఆఫీసర్లకు ఫిర్యాదు చేయగా దీనిపై విచారణ జరిపి టెండర్ రద్దు చేయడం శుభపరిణామమని కానీ గత మూడు సంవత్సరాలుగా గోల్కొండ సరిల్ పరిధిలో జరిగిన అన్ని టెండర్ల ప్రక్రియలపై విజిలెన్స్ విచారణ జరిపించాలని నిబంధనలను ఉల్లంఘిస్తూ,అక్రమాలకు పాల్పడుతున్న ఈఈ లాల్ సింగ్‌పై కఠిన చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

# ప్రీ మ్యాపింగ్ పేరుతో ఓట్ల తొలగింపు

**- ఖైరతాబాద్‌లో దాదాపు 12 వేల ఓట్ల గల్లంతు**
**- బిజెపి కనుసన్నల్లోనే ఎన్నికల సంఘం పనితీరు**
**- ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్.

**జూబ్లీహిల్స్, జులై 3, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ నియోజకవర్గంలో ప్రీ మ్యాపింగ్ పేరుతో ఓట్ల తొలగింపుకు పాల్పడుతున్నారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గంలో దాదాపు 12వేల ఓట్లను ఇప్పటికే తొలగించారన్నారు. ఈ వ్యవహారంలో కేంద్రంలోని బీజేపీ సర్కార్ హస్తం ఉందన్నారు. బీజేపీ కనుసన్నల్లోనే ఎన్నికల సంఘం పనిచేస్తుందన్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబరు 10 జహీరానగర్ కూడలిలో వెంకటేశ్వరనగర్ డివిజన్ బీఎల్వో అవగాహన శిబిరం పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాములు చవాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించడం లేదన్నారు. ప్రీ మ్యాపింగ్‌లో గల్లంతైన ఓట్లను తిరిగి చేర్చాలని ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డికి లేఖ రాసినట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో బూత్‌లెవల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీంతో వేలాది మంది అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. క్షేత్రస్థాయిలో బీఎల్వోలు కనీసం ఇళ్ల వద్దకు వెళ్లడం లేదని, నిబంధనల ప్రకారం ఇంటింటికి వెళ్లాల్సి ఉన్నా తమకు తోచిన వారికి, నచ్చిన వారికే పత్రాలను ఇస్తున్నారన్నారు. ప్రతి బూత్ వద్ద ప్రత్యేకంగా యువలను ఏర్పాటుచేస్తామని, ఓటరు నమోదుకు అవసరమైన సాయాన్ని అందించేందుకు వారు తోడ్పాటునందిస్తారని అన్నారు. నియోజకవర్గంలో జరిగిన మ్యాపింగ్ జాబితాను ప్రతి బూత్ ఏజెంట్‌కు అందజేయనున్నట్లు వివరించారు. తద్వారా మ్యాపింగ్ జాబితాలో గల్లంతైన ఓటర్ల వివరాలను చేర్చేలా బీఎల్వోలు కృషి చేయాలన్నారు. ఈ మేరకు డివిజన్ల వారీగా తాను సైతం పర్యటిస్తానని, అవగాహన కల్పిస్తానని స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ భారతీనాయక్, సీనియర్ కాంగ్రెస్ నేత మామిడి నర్సింగ్‌రావు, కాటూరి రమేష్, అరుణ్‌కుమార్, ఆంథోని, వనం శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ చెత్త వేసే ప్రాంతాలపై కమిషనర్ ఫోకస్

**-పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులకు కీలక ఆదేశాలు**



మల్కాజ్‌గిరి సర్కిల్ పరిధిలోని ప్రాంతాలలో అధికారులతో పాటు పర్యటిస్తున్న ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

**హైదరాబాద్, జులై 3 ప్రభావార్త:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి శుక్రవారం మల్కాజిగిరి సర్కిల్ 5 పరిధిలోని పలు బహిరంగ చెత్త వేయు ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, పారిశుద్ధ్య పరిస్థితులు, మౌలిక వసతులు, అక్రమంగా చెత్త, మట్టి, నిర్మాణ వ్యర్థాల పారవేతపై సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఫుట్‌పాత్‌ను విస్తరించి ప్రజలకు సౌకర్యవంతమైన నడక మార్గం కల్పించేలా ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. సీసీపీఎల్ పరిసరాల్లో పరిశుభ్రత ప్రమాణాలు సంతృప్తికరంగా లేవని గుర్తించి, నాలా మరమ్మతులు, అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. విష్ణుపురి కాలనీ చుట్టుపక్కల ఉన్న అన్ని నివాస గృహాలను స్వచ్ఛ ఆటో సేవలకు అనుసంధానం చేసి బహిరంగ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నరసింహారెడ్డి ఫంక్షన్ హాల్ సమీపంలో కొత్తగా వేసిన సీసీ రోడ్డుపై నీరు నిల్వ ఉండటాన్ని గమనించిన కమిషనర్, సమస్యను వెంటనే పరిష్కరించాలని డీఈఈకి ఆదేశించారు. అలాగే కాంట్రాక్టర్లు వదిలివెళ్లిన మట్టి కుప్పలను తక్షణమే తొలగించాలని స్పష్టం చేశారు. వెంకటేశ్వర నగర్ మస్జీద్ వద్ద స్థానిక ప్రజలకు అవగాహన కల్పించి, ప్రతి ఇంటిని స్వచ్ఛ ఆటో సేవలకు అనుసంధానం చేయాలని సూచించారు. వెంకటేశ్వర నగర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరా, మైక్ వ్యవస్థ పనితీరును పరిశీలించి, సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు. సమీపంలోని కల్లు కాంపౌండ్ దుకాణ యజమానితో మాట్లాడి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రాళ్లు, వ్యర్థాలను తొలగించాలని కోరారు. దుర్గానగర్, ప్రశాంత్ నగర్ రైల్వే భూముల్లో పేరుకుపోతున్న చెత్తను క్రమం తప్పకుండా తొలగించాలని పారిశుద్ధ్య అధికారులకు ఆదేశించారు. ఖాళీ ప్రదేశాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని యూబీడీ డిప్యూటీ డైరెక్టర్, హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. అప్పర్ బస్తీ రైల్వే ప్రాంతంలో పేరుకుపోయిన మట్టి కుప్పలను ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, పారిశుద్ధ్య శాఖలు సమన్వయంతో తొలగించాలని ఆదేశించారు. మట్టిని పారవేసే వ్యక్తులతో అక్కడికక్కడే సమావేశం నిర్వహించి హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు మట్టిని తొలగించే చర్యలు తీసుకోవాలని, ఇంజనీరింగ్ అధికారులు తొలగింపు పనుల అంచనా వ్యయాన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆ ప్రాంతంలోని ఇళ్లన్నింటినీ స్వచ్ఛ ఆటో సేవలకు అనుసంధానం చేసి, సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేసి నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జవహర్ నగర్ మేఘన కన్స్ట్రక్షన్స్ నిర్మాణ ప్రాంగణంలో చెత్త, రాళ్లు పేరుకుపోవడాన్ని గమనించిన కమిషనర్, యాజమాన్యంతో వెంటనే మాట్లాడి వాటిని తొలగించేలా టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. నిబంధనలకు పూర్తి అనుగుణంగా చర్యలు తీసుకునే వరకు యూజీ (యూసీ) జారీ చేయరాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాల్లో చెత్త, మట్టి, నిర్మాణ వ్యర్థాల పారవేతను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. అలాగే ప్రజలు కూడా చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా స్వచ్ఛ ఆటో సేవలను వినియోగిస్తూ మున్సిపల్ కార్పొరేషన్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు

## కిడ్నాప్‌కు గురైన బాలుడి అప్పగింత

**కంటోన్మెంట్, జులై 3 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో కిడ్నాప్‌కు గురైన బాలుడిని రక్షించి నిందితున్ని అరెస్ట్ చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తూర్పు గోదావరి జిల్లా మామిడి కుదురు,పెద్ద పట్నంకు చెందిన షేక్ మహ్మద్ అలీ సాయబ్ (42)అనే వ్యక్తి పొట్ట కూటి కోసం నగరానికి వలసవచ్చి చింతల్ సాయి నగర్‌లో నివాసం ఉంటూ మాస్టర్ కుక్కుగా పనిచేస్తున్నాడు. అతనికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు లేక పోవడంతో మగ బిడ్డను పెంచుకోవాలనే ఉద్యేశంతో ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. గత నెల 20న స్వగ్రామానికి వెళ్లేందుకు షేక్ మహ్మద్ అలీ సాయబ్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. ఫ్లాట్ ఫారంపై నిద్రిస్తున్న మహిళ పక్కన నిద్రిస్తున్న ఆ బాలుడిని ఆమెకు తెలియకుండా ఆ బాలుడిని అపహరించుకొని చింతల్‌లోని తన ఇంట్లోకి తీసుకెళ్లాడు. తీసుకొచ్చిన బాలుడి గురించి చుట్టుప్రక్కల వారు ప్రశ్నించగా రోడ్డుపై దొరికాడని చెప్పాడు. దొరికిన బాలుడిని దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్‌కు అప్పగించాలని సూచించడంతో పాటు ఆ బాలుడి కిడ్నాప్ వార్త మీడియాలో రావడంతో బయపడిన నిందితుడు జీడిమెట్ల పోలీసులకు అప్పగించాడు. ఆ బాలుడితో పాటు అపహరించిన మహ్మద్ అలీ సాయబ్‌ను జీడిమెట్ల పోలీసులు రైల్వే పోలీసులకు అప్పగించారు. ఈ కేసును సికింద్రాబాద్ జి.ఆర్.పి.ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్ గౌడ్,ఎస్ఐలు మాధవ్, సుబ్బారెడ్డిలు దర్యాప్తున్నారు.

### గృహ చోరీ కేసును ఛేదించిన పోలీసులు..ముగ్గురి అరెస్ట్

**అల్వాల్ జులై 3,ప్రభాతవార్త**

అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఒక ఇంటి దొంగతనం కేసును పోలీసులు ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసారు.వారి వద్ద నుంచి సుమారు 20.20లక్షల విలువైన 13.4తులాల బంగారు ఆభరణాలు,330గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణమూర్తి వివరాలను వెల్లడించారు.మేదిశెట్టి శ్యామ్ రావ్ దంపతులు జూన్ 3న ఇంటికి తాళం వేసి మెదక్ వెళ్లి జూన్ 27న తిరిగి వచ్చారు. ఈ సమయంలో ఇంటి తాళాలు పగుల గొట్టి ఉండటాన్ని గమనించారు.ఇంట్లోకి వెళ్లి చూడగా అల్మారా పగుల గొట్టి ఉంది.అందులోని బంగారం,వెండి వస్తువులు,నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు.బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారన్నారు.దర్యాప్తులో ఇంటికి ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్ లో వాచ్ మెన్ గా పని చేస్తున్న కొల్లి లోవరాజు (38) ఇంట్లో చోరీకి పాల్పడినట్లు తేలిందన్నారు. అనంతరం దొంగిలించిన బంగారం,వెండి వస్తువులను పాపనీ రాజు (45) మైలారం మహేష్ చారి(46)లకు విక్రయించినట్లు గుర్తించామన్నారు.నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 13.4తులాల బంగారు ఆభరణాలు,330గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు.ఈ కేసు ను మల్కాజ్ గిరి డీసీపీ శ్రీధర్ పర్యవేక్షణలో ఛేదించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో అల్వాల్ ఎస్‌హెచ్ఓ ప్రశాంత్,డిఐ వీరబాబు,ఎస్సైలు చంద్రశేఖర్,మల్లేష్ క్రైమ్ సిబ్బంది ఉన్నారు.

## ప్రజారోగ్య కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలి

**-జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్**



సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:** వివిధ జాతీయ, రాష్ట్ర ప్రజారోగ్య కార్యక్రమాలను వైద్యులు సమర్థవంతంగా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని డిఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. అమేరకు శుక్రవారం సూరజ్ భాను క్లస్టర్ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, బస్తీ దవాఖాన, ఆర్‌బిఎస్ క చెందిన వైద్యాధికారులు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అందించడం ప్రతి ఆరోగ్య సిబ్బంది బాధ్యత అన్నారు. ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, గర్భిణీల సంరక్షణ,సేవలు, శిశు టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గునియా పై ఇంటింటి ఆరోగ్య సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అలాగే ఆరోగ్య సేవల పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించి, ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డా: శ్రీధర్ , డా అనిత, డా: సాయిబాబా,డా.ఆశ్రిత రెడ్డి , శ్రీధర్, శ్రీనివాస్,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కొల్లూరు ఎస్‌టిపి, చెరువు తనిఖీ

**-పాల్గొన్న సిఎంసి కమిషనర్ సృజన, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి**



కొల్లూరు చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సృజన ,ఎండీ అశోక్‌రెడ్డి

**హైదరాబాద్, జులై 3,ప్రభాతవార్త:** కొల్లూరు ఎస్‌టీపీ ,చెరువుపై సైబబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.సృజన, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిలు సంయుక్త తనిఖీ నిర్వహించారు. కాలుష్యానికి సంబంధించిన ఫిర్యాదులు మురుగు నీటి శుద్ధి వ్యవస్థ పనితీరును సమీక్షించారు.ఈ తనిఖీలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ, సాగునీటి శాఖ, గృహ నిర్మాణ శాఖ పటాన్‌చెరు సర్కిల్ పారిశుధ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.ఈసందర్భంగా ఎస్‌టీపీ పనితీరు, కొల్లూరు చెరువులో కాలుష్యానికి దారితీస్తున్న అంశాలు, మురుగునీటి నిర్వహణను మరింత మెరుగుపరచడానికి,చెరువు పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలను అధికారులు పరిశీలించారు. శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి కాలుష్యానికి గల మూల కారణాలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలను చేపట్టి, చెరువు పరి రక్షణ , సమర్థవంతమైన మురుగునీటి నిర్వహణను నిర్ధారించాలని కమిషనర్ ఆదేశించారు.

# మురుగునీటి శుద్ధిలో జపాన్ బయోలేస్ సాంకేతికత విజయవంతం

**-హైదరాబాద్‌లో దేశంలోనే తొలి పైలట్ ప్రాజెక్టు..**
**-పనితీరును సమీక్షించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి**



శుద్ధి పనులను పర్యవేక్షిస్తున్న ఎండి. అశోక్ రెడ్డి

**హైదరాబాద్, జులై 3 ప్రభాతవార్త :** నగరంలోని నాలాలు, చెరువులు, డ్రెయిన్‌లలో ప్రవహించే మురుగునీటిని సమర్థవంతంగా శుద్ధి చేసేందుకు జపాన్‌కు చెందిన అత్యాధునిక బయోలేస్ సాంకేతికతతో చేపట్టిన దేశంలోనే తొలి పైలట్ ప్రాజెక్టు ఆశాజనక ఫలితాలు సాధించింది. ఫతేనగర్ జలమండలి ఎస్టీపీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 1 ఎంఎల్‌డీ సామర్థ్యంతో కూడిన పైలట్ ప్రాజెక్టు పనితీరును జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్ రెడ్డి శుక్రవారం పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జైకా), జపాన్‌కు చెందిన టీబీఆర్ సంస్థ, హైదరాబాద్ జలమండలి సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టును అమలు చేశారు. ప్రవహిస్తున్న కాలుశ్యం నాలా నీటిని బయోలేస్ సాంకేతికతతో శుద్ధి చేయడం భారతదేశంలో ఇదే తొలిసారి కావడం విశేషం.ఈ సందర్భంగా ఎండీ కె. అశోక్ రెడ్డి మాట్లాడుతూ, జపాన్‌లో ఇప్పటికే 400కు పైగా నదులు, జలమార్గాల పునరుద్ధరణలో విజయవంతంగా ఉపయోగించిన ఈ సాంకేతికత హైదరాబాద్‌లో కూడా ఆశాజనక ఫలితాలు అందించిందన్నారు. పైలట్ ప్రాజెక్టు ద్వారా నిర్వహించిన పరీక్షల్లో నీటి నాణ్యత గణనీయంగా మెరుగుపడిందని, పట్టణ నాలాల కాలుష్య నియంత్రణకు ఇది సమర్థవంతమైన, పర్యావరణహిత పరిష్కారంగా నిలుస్తుందని పేర్కొన్నారు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మూసీ నదిలో ఒక్క చుక్క మురుగునీరు కూడా చేరకుండా, నగరంలో ఉత్పత్తి అయ్యే మురుగునీటిని వంద శాతం శుద్ధి చేసిన అనంతరమే విడుదల చేసే లక్ష్యంతో జలమండలి సమగ్ర కార్యాచరణను అమలు చేస్తోందన్నారు. రానున్న ఏడాదిలో ఈ లక్ష్యాన్ని సాధించే దిశగా వేగంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రస్తుతం పైలట్ యూనిట్‌లో పంపింగ్ ద్వారా మురుగునీటిని శుద్ధి చేస్తున్నామని, భవిష్యత్తులో ఈ సాంకేతికతను నేరుగా నాలాలు, వాగుల్లో ప్రవహించే మురుగు నీటిపైనే అమలు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. పైలట్ ప్రాజెక్టు ఫలితాల ఆధారంగా నగరంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఈ విధానాన్ని విస్తరించే అంశాన్ని అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు.రసాయనాల వినియోగంలేకుండానే సహజ సూక్ష్మ జీవుల ద్వార మురుగు నీరు శుద్ధి కావడం, నిర్వాహన వ్యయం తగ్గడం, బురద ఉత్పత్తి వ్యయం తగ్గడం, బురద ఉత్పత్తి గణనీయంగా తగ్గడం ఈ విధానం ప్రత్యేకతలని పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్టులో నిర్వహించిన పరీక్షల్లో సేంద్రియ కాలుష్యం 90 శాతం, సస్పెండెడ్ సాలిడ్స్ 85 శాతం వరకు తగ్గినట్లు వెల్లడించారు. దుర్వాసన తగ్గడంతో పాటు నీటిలో కరిగిన ఆక్సిజన్ స్థాయిలు పెరగడం వల్ల మూసీ నది, చెరువులు, సరస్సుల్లోకి చేరే నీటి నాణ్యత గణనీయంగా మెరుగుపడినట్లు టీబీఆర్ సంస్థ ప్రతినిధులు వివరించారు. కాలుష్య నియంత్రణ మండలి అనుమతుల అనంతరం భవిష్యత్తులో హైదరాబాద్‌లో నిర్మించనున్న కొత్త మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో ఈ సాంకేతికతను అమలు చేసే అవకాశాలను పరిశీలించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి సీజీఎం సుజాత, ప్రాజెక్టు అధికారులు, జైకా ప్రతినిధులు, టీబీఆర్ సంస్థ సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

## తెలుగు విశ్వవిద్యాలయంలో రిలే నిరాహార దీక్షలు


తెలుగు విశ్వవిద్యాలయ నాంపల్లి ప్రాంగణంలో రిలే నిరాహారదీక్షలు చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది

**నాంపల్లి, జూలై 3 ప్రభాతవార్త :** తెలుగు విశ్వవిద్యాలయం పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నాంపల్లిలోని విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని తెలంగాణతల్లి విగ్రహం వద్ద శుక్రవారం ఉదయం పెద్దయెత్తున విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు, తెలుగు భాషాభిమానులు, తెలుగు సంస్కృతి పరిరక్షకులు, విద్యార్థి సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని తెలుగు విశ్వవిద్యాలయాన్ని కాపాడుకుందాం, నాంపల్లిలోనే కొనసాగిద్దాం, పరిరక్షిద్దాం, అభివృద్ధి చేద్దాం అనే నినాదాలతో రిలే నిరాహారదీక్షలను ప్రారంభించారు. అదేవిధంగా విశ్వవిద్యాలయ బాచుపల్లి, వరంగల్ ప్రాంగణాల్లో ఉద్యమానికి సంఘీభావం ప్రకటిస్తూ నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయాన్ని కాపాడుకుంటూ అక్కడే కొనసాగాలని వారు డిమాండ్ చేశారు. అలాగే తిరుమలరావు వ్యవహారంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తపరుస్తూ విశ్వవిద్యాలయ పరిరక్షణ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ 2500మందికిపైగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విశ్వవిద్యాలయాన్ని ప్రైవేట్ వ్యక్తుల ప్రభావం నుండి విముక్తిచేయాలని డిమాండ్ చేశారు. తిరుమలరావు వ్యక్తిగత సామాగ్రిని వెంటనే క్యాంపస్ నుండి తొలగించాలని, ఆద్యకళ ఆక్రమణలోనున్న తరగతి గదులను అప్పగించాలన్నారు. ప్రభుత్వం వెంటనే తెలుగు విశ్వవిద్యాలయ పరిరక్షణకు చర్యలు తీసుకుని ప్రైవేట్ వ్యక్తులను పంపివేయాలని విజ్ఞప్తి చేశారు.

## కల్వకుంట్ల కవితను చంపేందుకు ప్రభుత్వం కుట్ర


సమావేశంలో మాట్లాడుతునన ఇస్మాయిల్.

**జూబ్లీహిల్స్, జూలై 3, ప్రభాతవార్తః** తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవితను చంపేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని టీఆర్ఎస్ నాయకులు రూప్‌సింగ్, ఇస్మాయిల్, చిలుక ప్రవీణ్ ఆరోపించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ.. ఉద్యమకారుల తరుపున పోరాటం చేసిన కవితను లక్ష్యంగా చేసుకొని చంపే కుట్ర చేస్తున్నారన్నారు. పోలీసులు అత్యంత క్రూరంగా ప్రవర్తించారని, ఓవరాక్షన్ చేసిన పోలీసులపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా ప్రశ్నించే గొంతులను నులిమేద్దామని చూస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి కన్నుసన్నల్లోనే ఇదంతా జరుగుతుందన్నారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని, ముమ్ముందు మరింత ఉధృతంగా పోరాటం చేస్తామన్నారు. ఉద్యమకారులపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

## ఉద్యమకారుల సంక్షేమంపై విస్తృత సంప్రదింపులు..

### నాటి ఉస్మానియా విద్యార్థి నాయకులకు కమిటీ ఆహ్వానం

**తార్నాక, జూలై 3 ప్రభాతవార్త :** ఉద్యమకారుల సంక్షేమంపై విస్తృత సంప్రదింపులు, నాటి ఉస్మానియా విద్యార్థి నాయకులకు కమిటీ ఆహ్వానం తెలియజేస్తుందని మోతె సభ్యులు శోభన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారి సంక్షేమం కోసం చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సిఫార్సులు చేసేందుకు జీఓ నెం. 679 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఈ నెల 6వ తేదీ నుంచి ఉద్యమకారులతో విస్తృత స్థాయి సంప్రదింపుల కార్యక్రమాన్ని ప్రారంభించనుందన్నారు. ఇందులో భాగంగా జూలై 6న నిర్వహించే తొలి సమావేశంలో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి జేఏసీ నాయకులతో కమిటీ సమావేశం కానుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో విశిష్ట పాత్ర పోషించిన నాటి విద్యార్థి నాయకులను ఈ సమావేశానికి ప్రత్యేకంగా ఆహ్వానిస్తూ, ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేయాల్సిన విధానాలు, సంక్షేమ చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై తమ విలువైన సూచనలు, సలహాలు అందించాలని కమిటీ కోరింది. ఈ సమావేశం జూలై 6 న ఉదయం 10 గంటలకు సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్మారక స్థూపం వద్ద నిర్వహించనున్నారు. ఈ కమిటీలో కె. కేశవరావు, పొన్నం ప్రభాకర్, ఎం. కోదండరామ్, అద్దంకి దయాకర్, రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి సభ్యులుగా తెలియజేశారు.

## విద్యుత్ లేని ప్రాంతాలు...

**బేగంబజార్, జూలై 3 ప్రభాతవార్త:** బేగంబజార్ సిబిడి పరిధిలో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా శనివారం 11 కెవి విద్యుత్ ఫీడర్లలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు బేగంబజార్ డివిజనల్‌ఇంజనీర్ అన్నయ్య తెలిపారు. 11 కెవి మోతీ మార్కెట్, ఇసామియా బజార్ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా ఉదయం 9గంటల 30నిమిషాల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సంఘం హోటల్, ఎ. కె.భవన్, రైల్వేట్రక్, ట్రాఫిక్‌పిఎస్, ఇసామియాబజార్, గుజరాత్‌గల్లీ, ఆర్‌టిసి కాంప్లెక్స్, ఆంధ్రాబ్యాంకు తదితర ప్రాంతాలు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. 11 కెవి రంగ్ మహల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రంగ్‌మహల్, మెడికల్ కళాశాల, ఆర్‌టిసి కాంప్లెక్స్, అధిత్య ఆసుపత్రి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్‌లు అందజేత


విద్యార్థులకు నోట్ బుక్‌లను అందచేస్తున్న రాకేష్‌జైస్వాల్

**గన్‌ఫౌండ్రి, జూలై 3ప్రభాతవార్త:** జాంబాగ్ డివిజన్ పరిధిలోని కట్టెలమండి ఆంధ్ర విద్యాలయం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జాంబాగ్ డివిజన్ బిజెపి మాజీ కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ పంపిణీచేశారు. ఈమేరకు రాజ్యసభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ పుట్టిన రోజు సందర్బంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేకకార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు నోట్‌బుక్‌లను అందచేసినట్లు ఆయన చెప్పారు. పేద విద్యార్థులను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో విద్యార్థులకు నోట్ బుక్‌లను అందచేయడం జరిగిందన్నారు. పాఠశాల ప్రధానోఉపాధ్యాయుడు చల్లా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మంచి ఆలోచనతో విద్యార్థులకు నోట్‌బుక్‌లను అందచేయడం సంతోషదాయకమన్నారు. ఈకార్యక్రమలో బిజెపి నాయకులు వి.శంకర్‌కుబేర్, ఠాకూర్ బాలాజీసింగ్, సందీప్‌జైన్, రాజుయాదవ్, సిహెచ్.రవి, పాఠశాల ఉపాధ్యాయులు పి.హేమ, బి. మంజుల, ఎస్.సునీత, బి.జ్యోతి, ఎం.ప్రియా, ఆర్.కవిత, జి.సంగీత, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన మహిళాభ్యున్నతికి లక్ష్మీదేవమ్మ కృషి

### - కేంద్ర మాజీమంత్రి వేణుగోపాలాచారి, మాజీ డిజీపి గోపీనాథరెడ్డి

**రవీంద్రభారతి, జూలై 3 ప్రభాతవార్త :** సమైక్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో రెండుసార్లు ఎమ్మెల్యేలుగా, రెండుసార్లు ఎమ్మెల్సీగా మూడుసార్లు మంత్రిగా, సిడబ్ల్యుసి సభ్యురాలిగా పనిచేసి బడుగు బలహీనవర్గాలకు ముఖ్యంగా మహిళాభ్యున్నతికి ఎంతగానో కృషిచేసిన గొప్ప రాజకీయవేత్త, సంఘసేవకురాలు అని కేంద్ర మాజీమంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, మాజీ డీజీపి సి.ఎన్.గోపీనాథరెడ్డిలు అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో మాతృదేవోభవ సత్సంగ్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో జరిగిన లక్ష్మీదేవి 90వ జయంతి, జాతీయ వైద్యుల దినోత్సవం, చార్టెడ్ అకౌంటెంట్స్ దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథులుగా విచ్చేసిన వేణుగోపాలాచారి, గోపీనాథరెడ్డిలు విశిష్ట అతిథులు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.వి.శ్రీధర్, అధ్యక్షురాలు డా. ఎస్.ఎన్.ఉదయలక్ష్మి, నండూరి రమేష్, ఆధ్యాత్మికవేత్త ప్రసాదశర్మ, ప్రముఖ కాంగ్రెస్ నాయకులు వీరబొమ్మ రమేష్, డా. సింగం శ్రీనివాసరావు, ఉమామహేశ్వర్‌రెడ్డి, డా. బాలకృష్ణ, రాజేందర్ యాదవ్, దయానంద్, పాత్రికేయుడు సూర్యప్రకాష్, అంజనీదేవి, ఎస్.వి.గౌడ్ తదితరులతో కలిసి లక్ష్మీదేవి చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించి, పలువురు సంఘ సేవకులకు సమాజానికి నిస్వార్థ సేవలు అందిస్తున్న డాక్టర్లు, చార్టెడ్ అకౌంటెంట్లకు లక్ష్మీదేవి అవార్డులతో ఘనంగా సత్కరించి ప్రసంగించారు. భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీలు నిజాయితీపరులైన లక్ష్మీదేవికి ఎంతో గౌరవ మర్యాదలిచ్చి పార్టీలో అత్యున్నతస్థానం సిడబ్ల్యూసి మెంబరుగా సేవలు చేసే అవకాశంతోపాటు రాష్ట్ర మంత్రి పదవులిచ్చారని గుర్తుచేశారు. సభకుముందు సంగీత వాద్యకచ్చేరీలు, భక్తిసంగీత కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి.


లక్ష్మీదేవి చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పిస్తున్న వేణుగోపాలాచారి, గోపీనాథరెడ్డి, శ్రీధర్, ఉదయలక్ష్మి, ప్రసాదశర్మ, రమేష్‌గుప్తా తదితర అతిథులు

## స్ట్రచ్చర్‌కోడ్ మ్యాపింగ్‌తో నష్టాల నివారణ : డైరెక్టర్ నర్సింహులు

**హైదరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** వినియోగదారులకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సాంకేతికత ఆధారిత విద్యుత్ సేవలను అందించాలనే డీటీఆర్, స్ట్రక్చర్ కోడ్‌కు మ్యాపింగ్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని టిజిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్. నరసింహులు అన్నారు. ఈమేరకు శుక్రవారం అంబర్‌పేట్ పరిధిలో స్ట్రచ్చర్‌కోడ్ మ్యాపింగ్‌ను ప్రత్యక్షంగా పరిశీలించారు. డీటీఆర్ స్థాయిలో వినియోగదారుల సేవల ఖచ్చితమైన మ్యాపింగ్ ద్వారా విద్యుత్ నెట్‌వర్క్‌పై సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందని, దీని ద్వారా లోపాల గుర్తింపు, విద్యుత్ అంతరాయాల విశ్లేషణ, నష్టాల నియంత్రణ. సేవల మెరుగుదలకు ఎంతో దోహదపడుతుందన్నారు. విద్యుత్ వ్యవస్థలో పనిచేసే ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా భద్రతా నిబంధనలను పాటించాలని సూచిస్తూ, పని ప్రారంభానికి ముందు లైన్ క్లియర్ (ఎల్‌సి) పొందడం, వ్యక్తిగత భద్రతా పరికరాలు ధరించడం, ఎర్తింగ్ ఏర్పాటు చేయడం, సేఫ్టీ టూల్స్ వినియోగించడం వంటి అంశాల్లో ఎటువంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. .అలాగే, ప్రతి ఉద్యోగి విధులు నిర్వర్తించి సురక్షితంగా తన కుటుంబ సభ్యుల వద్దకు చేరుకోవడం సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. "సేఫ్టీ ఫస్ట్" అనే భావన ప్రతి ఉద్యోగి ఆచరణలో ప్రతిబింబించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఈ (ఆపరేషన్స్) సెంట్రల్ రమేష్ , ఇన్‌చార్జ్ డీఈ (ఆపరేషన్స్) ఆజాంబాద్, ఏఈ (ఆపరేషన్స్) అంబర్‌పేట్, ఏఈ (ఆపరేషన్స్) గోల్నాక సంబంధిత సిబ్బందితో కలిసి పలు డీటీఆర్‌లను సందర్శించిన డైరెక్టర్ స్ట్రక్చర్ కోడ్ ఆధారంగా వినియోగదారుల సర్వీసుల మ్యాపింగ్ విధానం, బిల్లింగ్ సమయంలో డేటా నమోదు ప్రక్రియ, ఫీల్డ్ స్థాయిలో ఎదురవుతున్న సవాళ్లు వాటి పరిష్కార మార్గాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.


అంబర్‌పేట్‌లోని ఓఇంట్లో మీటర్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్ నర్సింహులు, ఎస్ఈ రమేష్ తదితరులు

## రచనలతో మానవీయ విలువలు చాటిచెప్పిన సాహితీవేత్త కొలకలూరి ఇనాక్

### -కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డాక్టర్ నందిని సిధారెడ్డి

**చిక్కడపల్లి జూలై 3 ( ప్రభాతవార్త ) :** తెలుగు సాహితీచరిత్రలో అన్ని ప్రక్రియలను స్పృశించిన మహాకవి ఆచార్య కొలకలూరి ఇనాక్ అని కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో ప్రఖ్యాత సాహితీ వేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహం కార్యక్రమ లో భాగంగా ప్రముఖ రచయిత విహారి రచించిన అపూర్వ గ్రంథావిష్కరణ సభ గానసభ అధ్యక్షుడు కళావిఎస్ జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. గ్రంథాన్ని ఆవిష్కరించిన అనంతరం డాక్టర్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ సాహిత్యాన్ని కేవలం వినోద సాధనంగా కాకుండా సామాజిక మార్పునకు ఆయుధంగా మలిచిన మహోన్నత రచయిత ఇనాక్ అని అన్నారు. దళిత సాహిత్యానికి ఆయన అందించిన దిశానిర్దేశం చిరస్మరణీయమని, సమాజంలోని అణగారిన వర్గాల జీవితాలను సాహిత్యంలో ప్రతిష్ఠించి తెలుగు సాహిత్యానికి కొత్త దృక్పథాన్ని అందించారని చెప్పారు. విహారి మాట్లాడుతూ కొలకలూరి ఇనాక్ సాహిత్య వారసత్వాన్ని భావితరాలకు అందించడం ప్రతి సాహిత్యాభిమాని బాధ్యత అని, ఆయన రచనలను విస్తృతంగా అధ్యయనం చేయాలని పిలుపునిచ్చారు. తెలుగు సాహిత్యంలో ఇనాక్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ఆచార్య కొలకలూరు ఇనాక్ మాట్లాడుతూ విహారి రచించిన అపూర్వ పాఠకులను ఆలోచింపజేసే, సాహిత్య విలువలను ప్రతిబింబించే గ్రంథమని కొనియాడారు.


ప్రముఖ రచయిత విహారి రచించిన అపూర్వ గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డాక్టర్ నందిని సిధారెడ్డి

## వైభవంగా వానదేవత విగ్రహ ప్రతిష్టానోత్సవం

**నార్సింగి, జూలై 3 ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ డివిజన్‌లో శుక్రవారం వానదేవత సహిత కాటంరాజు విగ్రహ ప్రతిష్టాపనోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచరణలు, మంగళ వాయిద్యాలు, వందలాది మంది భక్తజనుల జయ జయ ధ్వనుల మధ్య శాస్త్రోక్తంగా ఈ వేడుక నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంత ఉన్నత స్థానాలకు ఎదిగినా... మన సంస్కృతీ, సాంప్రదాచాలు, ఆచారాలను మనం పాటిస్తూ భావి తరాలకు అందించాలని సూచించారు. పండగలు మన ఆచారాలను భావి తరాలకు అందించే వారధులని వివరించారు. సనాతన ధర్మంలో నిర్వహించే ప్రతీ పండగ వెనుకాల ఓ ఆరోగ్య రహస్యం ఇమిడి ఉందని తెలిపారు. కాటంరాజు, వానదేవతల ఆశిస్సులతో రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలంతా పాడిపంటలు, సుఖ సంతోషాలతో ఉంటారని పేర్కొన్నారు. గౌడ సామాజిక వర్గం అభ్యున్నతికి నావంతు పూర్తి సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం సైతం గౌడకుల అభివృద్ధికి అనేక సంక్షేమ పతకాలను సమర్థవంతంగా అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బి.మహేందర్‌గౌడ్, సహకార సంఘం చైర్మన్ రాందాస్ ముదిరాజ్, మాజీ కార్పోరేటర్ సాగర్‌గౌడ్, నాయకులు పాపయ్య యాదవ్, సురేష్‌గౌడ్, సుమన్‌గౌడ్ పాల్గొన్నారు.


బండ్లగూడలో వానదేవత సహిత కాటంరాజు విగ్రహంను ఆవిష్కరిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

## ఓటర్ జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి


యానిమిరేషన్ ఫారాలు అందజేస్తున్న డిఎంసి అరుణ కుమారి, రాజేష్ కుమార్

**చార్మినార్, జూలై 3 ప్రభాతవార్త :** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బహదూర్‌పుర నియోజకవర్గం ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్‌ఆఫీసర్, డిఎంసి అరుణ కుమారితో కలిసి బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ దూద్‌బౌలిలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పర్యవేక్షించడం జరిగింది. 2025 సంవత్సరంలో ఓటర్ జాబితాలో నమోదైన ఓటర్లుకు ఇంటింటికి వెళ్లి యానిమిరేషన్ ఫారాలను అందజేశారు. ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పిస్తూ18 సంవత్సరాలు వయస్సు నిండిన ప్రతీ వ్యక్తి తమ పేరును ఓటర్ జాబితాలో నమోదు చేసుకోవాలని కోరటం జరిగిందని బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోనాలు శ్రీ కాంత్, రామకృష్ణ, బూత్ లెవెల్ అధికారులు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం

**చార్మినార్, జూలై 3 ప్రభాతవార్త :** దూద్‌బౌలిలోని శ్రీ సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామి మందిరంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీ శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమంలో దేవస్థానంల వంశ పారం పర్య ధర్మ కర్త మహేశ్వరం శ్రీనివాస్ చారి, దేవాలయం ప్రధాన అర్చకులు సి.వీరయ్య శర్మ, కార్యవర్గ సభ్యులు మహేశ్వరం నాగేశ్వర చారితో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాహిత సాహిత్యమే శాశ్వతం: బసవరాజు శ్రీనివాస్


ఆచార్య ఇనాక్ రచించిన ఖినాగార్జునఖి గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర బ్రాహ్మణ పరిషత్ బసవరాజు శ్రీనివాస్

**చిక్కడపల్లి, జూలై 3 ( ప్రభాతవార్త )** ప్రజా హితాన్ని కాంక్షించే సాహిత్యం సమాజంలో శాశ్వతంగా నిలిచివుంటుందని రాష్ట్ర బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు బసవరాజు శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళా సుబ్బారావు కళావేదికపై భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రఖ్యాత సాహితీ సంస్థ ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహం కార్యక్రమంలో భాగంగా ఆచార్య ఇనాక్ రచించిన ఖినాగార్జునఖి గ్రంథ ఆవిష్కరణ సభ గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా బసవరాజు శ్రీనివాస్ గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఆచార్య ఇనాక్ రచనలు దళిత దృక్పథాన్ని ప్రతిబింబించడంతో పాటు, సమాజంలో నెలకొన్న అసమానతలపై వారికున్న ఆవేదనను, బాధను వ్యక్తం చేసేవిగా ఉంటాయని ఆయన కొనియాడారు. ఇనాక్ గారు వ్యక్తిగతంగా ఎదుర్కొన్న వివక్షను తన రచనల ద్వారా పాఠకుల హృదయాలకు హత్తుకునేలా వివరించారని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా కుసుమ ధర్మన్న పీఠం స్థాపకురాలు రాధా కుసుమ గ్రంథ సమీక్ష చేయగా, కార్యక్రమంలో శంకరమంచి లక్ష్మీప్రియ తదితరులు పాల్గొన్నారు. వాహిని ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నాట్య గురువు రాజశ్రీ, సంగీత గురువు పద్మజల శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం, గానం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

## రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

### -ఉన్నత విద్యా మండలి ముట్టడిలో తీవ్ర ఉద్రిక్తత
### -భారీగా మోహరించిన పోలీసులు

**మెహిదీపట్నం, జులై 3, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థ పాలనతో రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మాసబ్ ట్యాంక్ లోని ఉన్నత విద్యా మండలి ముందు తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో మాసబ్ ట్యాంక్ ప్రాంతమంతా విద్యార్థుల నినాదాలతో దద్దరిల్లింది. ఉన్నత విద్యా మండలిలోకి విద్యార్థులు చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయడంతో పోలీసులకు, విద్యార్థులకు తీవ్ర వాగ్వివాదం, తోపులాట చోటుచేసుకుంది. అనంతరం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, వేముల రామకృష్ణలు మాట్లాడుతూ...ఫీజు రియంబర్స్ మెంట్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా అమలు చేయకపోవడంతో రాష్ట్రంలో 14 లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.10 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రియంబర్స్ మెంట్ పథకంపై కోర్టు స్టే విధిస్తే ఏ విధంగా కౌన్సిలింగ్ నిర్వహించి అడ్మిషన్ ప్రక్రియ చేపడతారని ప్రశ్నించారు. ఈ పథకం రాష్ట్ర ప్రభుత్వం భిక్ష కాదని, విద్యార్థుల హక్కుని గుర్తుంచుకోవాలన్నారు. జీవోలు, కమిటీల పేరిట రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తే సహించేది లేదన్నారు. ఫీజుల నియంత్రణపై కమిటీలు వేయడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిలపై ఇదేవిధంగా మొండి వైఖరి ప్రదర్శిస్తే రానున్న కాలంలో తగిన గుణపాఠం చెబుదామని, రాష్ట్రంలోని అన్ని విద్యార్థి సంఘాలతో చర్చలు జరిపి ఈనెల 7న చలో ఇందిరాపార్కు వద్ద విద్యార్థుల సమరభేరిని మోగిస్తామని హెచ్చరించారు. ధర్నాలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్, ఉదయ్, నరేష్, జగన్, ప్రవీణ్, హరీష్, మహేష్, అనిత, జగన్, వంశీ, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


మాసబ్ ట్యాంక్ లోని ఉన్నత విద్యామండలి ముందు ధర్నా చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, వేముల రామకృష్ణ.

## ఫుట్‌ఫాత్‌పై నిద్రిస్తున్న వ్యక్తిని హత్యచేసిన దుండగులు

**బేగంపేట జులై 3, ప్రభాతవార్త** రాంగోపాల్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో ఫుట్‌ఫాత్‌పై నిద్రిస్తున్న వ్యక్తి హత్యకు గురవడం కలకలం రేపింది. పి.జీ.రోడ్డులోని పార్శీ ధర్మశాల గేటు సమీపంలో ఫుట్‌ఫాత్‌పై నిద్రిస్తున్న కన్నా అనే వ్యక్తిని గుర్తు తెలియని దుండగులు పదునైన ఆయుధంతో తలపై మోదీ దారుణంగా హత్యచేసారు. రాంగోపాల్‌పేట ఇన్స్‌పెక్టర్ బి.సురేష్ కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బన్సీలాల్ పేట డబుల్ బెడ్ రూం ఇండ్లలో నివసించే మహ్మద్ తాజ్ గత 40ఏళ్లుగా పార్శీ ధర్మశాల గేటు పక్కన పూల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన దుకాణానికి ఎదురుగా నవీన్ కుమార్ అనే వ్యక్తి స్క్రాప్ (పాతసామాన్లు) దుకాణం నడుపుతున్నాడు. ఈ స్క్రాప్ దుకాణానికి కన్నా, సిరాజ్ అనే ఇద్దరు వ్యక్తులు ప్రతి రోజు పాత పేపర్లు సేకరించి అమ్ముతుండేవారు. రాత్రి కాగానే పార్శీ ధర్మశాల గేటు ఎదురుగా కన్నా, అతనికి కొద్ది దూరంలో సిరాజ్ లు నిద్రించేవారు. ప్రతి రోజు ఉదయం పూల వ్యాపారి తాజ్ ,స్క్రాప్ దుకాణ దారుడు నవీన్, కన్నా, సిరాజ్ లు కలిసి ఛాయ్ తాగడం అలవాటు. ఎప్పటి లాగే ఈ నెల 2వ తేదీన రాత్రి గం 10ల సమయంలో తాజ్ తన పూల దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లే సమయంలో కన్నా, సిరాజ్ లు ఇద్దరూ ధర్మశాల గేటు వద్ద పడుకుని ఉన్నారు. మరుసటి రోజు (శుక్రవారం) ఉదయం గం 9.40ల ప్రాంతంలో తాజ్ తన దుకాణానికి వచ్చి సిరాజ్ ను ఛాయ్ తీసుకు రావాలని పురమాయించాడు. సిరాజ్ ఛాయ్ తీసుకుని వచ్చిన తర్వాత కన్నాను నిద్ర లేపేందుకు తాజ్ వెళ్లి పిలిచాడు. ఎంతకీ కన్నా నుంచి స్పందన లేకపోవడంతో తాజ్ దగ్గరగా వెళ్లి పరిశీలించాడు. ఈ సమయంలో అతడు కన్నా తలకు బలమైన గాయం అయివుండి రక్తం మడుగులో పడి ఉండటాన్ని గమనించాడు. వెంటనే ఈ సమాచారాన్ని గస్తీ పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే రాంగోపాల్‌పేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరో పాత కక్షలు, లేదా మరేదైనా కారణంతో కన్నా తలపై పదునైన ఆయుధంతో బలంగా కొట్టడం వల్లే తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. పూల వ్యాపారి మహ్మద్ తాజ్ ఫిర్యాదు మేరకు రాంగోపాల్‌పేట ఇన్స్‌పెక్టర్ బి.సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించారు. హత్య జరిగిన ప్రాంతాన్ని మహంకాళీ ఏసీపీ శ్రీధర్ పరిశీలించారు. హత్య ఎలా జరిగింది అన్న విషయంపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.


హత్యకు గురైన ప్రదేశంలో స్థానికులతో మాట్లాడుతున్న పోలీసులు.

## సంజయ్‌పురి కాలనీలో ఘనంగా పోచమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ



**జగద్గిరిగుట్ట, జూలై3 ప్రభాతవార్త** అంగరంగవైభవంగా జగద్గిరిగుట్ట సంజయ్‌పురి కాలనీలోని శ్రీశ్రీశ్రీ పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా శుక్రవారం నిర్వహించారు . సంజయ్‌పురి కాలనీ శ్రీ పోచమ్మ అమ్మవారి దేవాలయ కమిటీ చైర్మెన్ రేగోడు ప్రవీణ్‌గుప్తా, ఆలయ కమిటీ నిర్వాహకులతో నిర్వహించిన ఈ పునఃప్రతిష్ఠ ఉత్సవాలకు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా భారతీయ జనతాపార్టీ అర్బన్ అధ్యక్షులు జె.కె. శేకర్‌యాదవ్, పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్. ఎస్.మల్లారెడ్డి, గాజులరామారం మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరిరావు, ఉప్పల రమేశ్‌గుప్తా, సంజయ్‌పురి కాలనీ సంక్షేమసంఘ అధ్యక్షులు ఆరుణ్‌రెడ్డి, సాయి, బాలు పలువురు నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## చంపేస్తామంటూ వ్యాపారికి బెదిరింపులు

**జూబ్లీహిల్స్, జూలై 3, ప్రభాతవార్తః** ఓ వ్యాపారవేత్తను చంపేస్తామంటూ బెదిరించిన సంఘటన జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు జిల్లాకు చెందిన వ్యాపారవేత్త శివరామ్ కృష్ణ పృథ్వీ మే 3న జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడి సమీపంలోని కాసా హోటల్‌లో బస చేశారు. మే 9 తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో కృష్ణ అనే వ్యక్తి ఫోన్ చేసి ఎక్కడ ఉన్నావని ప్రశ్నించాడు. 20 నిమిషాల తర్వాత ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు హోటల్‌లో బస చేసిన అతని గది తలుపు తట్టి, బలవంతంగా తలుపు తోసి లోపలికి రావడానికి ప్రయత్నించారు. వెంటనే తలుపు మూసి గడియ పెట్టుకొన్న శివరామకృష్ణ తీవ్ర భయాందోళనకు గురై డయల్-100కు సమాచారం అందించాడు. ప్రాణభయంతో గది కిటికీ నుంచి బయటకు దూకి పెద్దమ్మగుడి సమీపంలోని భద్రతా సిబ్బంది వద్దకు వెళ్లాడు. మరోసారి ఫోన్ చేసిన కృష్ణ గది నంబర్ అడుగగా స్పందించకపోవడంతో వాట్సాప్ ద్వారా హోటల్, శివరామకృష్ణ గది నంబర్ ఫొటోలు పంపుతూ "నిన్ను చంపేస్తాను"ఈరోజే నీ చివరి రోజు" "తప్పు వ్యక్తితో గొడవ పెట్టుకున్నావు" అంటూ బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదుతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులతో శివరామ్‌కృష్ణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా, మరోమారు కృష్ణ ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దోపిడీ కేసును ఛేదించిన నారాయణగూడ పోలీసులు

**సైఫాబాద్, జూలై 3 ప్రభాతవార్త:** అక్షరాల 7 లక్షల 70 వేల రూపాయలు నగదును దొంగిలించిన దొంగను 36 గంటల్లో కేసు ఛేదించి నిందితుడిని అరెస్టు చేసి నగదును పూర్తిగా నారాయణగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సుల్తాన్ బజార్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ మట్టయ్య ఆధ్వర్యంలో నారాయణగూడ డిటెక్టివ్ పోలీసులు విజయవంతంగా ఈ కేసును ఛేదించారు. శుక్రవారం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మత్తయ్యతోపాటు నారాయణగూడ పోలీస్ స్టేషన్ సిఐ సైదేశ్వర్ మాట్లాడుతూ నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో అమిత్ ఆగర్వాల్ తన భార్య కుమారులతో కలిసి జీవిస్తున్నారు. కాగా గత ఏడాది డిసెంబరు మాసంలో తన ఇల్లు పునరుద్ధరణ కార్యక్రమాలను చేపట్టారు. ఈ పనుల నిమిత్తం ఆయన తన వద్దనున్న 7 లక్షల 70 వేల రూపాయల నగదును తన భార్యకు సంబంధించిన హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టి మొదటి అంతస్తులోగల బెడ్‌రూమ్‌లో ఉన్న చెక్క అల్మారాలో భద్రపరిచారు. జూన్ 30న రాత్రి సమయంలో ఆమె అల్మారా తెరిచి ఉంది. హా ్యండ్‌బ్యాగ్‌లో నగదు కనిపించలేదు. దీంతో అమిత్ అగర్వాల్ నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాంకేతిక నిఘా ఆధారంగా శుక్రవారం ఉదయం నిందితుడు రాజస్తాన్‌కు చెంది బోయినపల్లిలో నివాసం ఉంటున్న కార్పెంటర్ దీపేష్ ఖాతి(19)ని పోలీసులు అదుపులోకి తీసుకుని నగదును స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎసిపి, సిఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐలు బి.అభిలాష, సి.హెచ్.నాగరాజు, సిబ్బంది కె.అభిలాష, పి.పవన్ తదితరులు పాల్గొన్నారు.

## మదర్సా టీచర్‌కు 20 ఏళ్ళ జైలుశిక్ష

**చాంద్రాయణగుట్ట, జూలై 03, ప్రభాతవార్త :** బాలుడిపై లైంగిక దాడి కేసులో ఒక మదర్సా ఉపాధ్యాయుడికి కోర్టు 20 ఏళ్ళ జైలుశిక్షతోపాటు బెదిరింపు కేసులో అదనంగా మరో రెండేళ్ళ జైలుశిక్ష విధించింది. బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ ఆర్. దేవేందర్ కథనం ప్రకారం... బాధితుడి తండ్రి 2022, మార్చి 23న బాలాపూర్ పోలీసుస్టేషన్లో ఒక ఫిర్యాదు చేశాడు. గత ఆరు నెలలుగా తన కుమారుడు (11) షాహీన్‌నగర్‌లోని అల్ ఐన్ కాలనీలోని జామియా మసీదు నిమ్రాలో ఉన్న మదర్సా (జామియా నూరుల్ అన్వర్)కు వెళతాడని తెలిపాడు. గత వారం రోజులుగా తన కుమారుడు మదర్సాకు వెళ్ళటం లేదన్నాడు. ఈ విషయమై తన కుమారుడిని ప్రశ్నించగా నెల రోజుల క్రిందట చాంద్రాయణ గుట్ట, కుబాకాలనీ నివాసి, మదర్సా ఉపాధ్యాయులు సయ్యద్ నదీమ్ (22) తనను అతని ఇంటికి తీసుకువెళ్ళి, బట్టలు ఊడదీసి బలవంతంగా అసహజ లైంగిక చర్యకు పాల్పడ్డట్లు వివరించాడు. విషయాన్ని బయట ఎక్కడైనా చెబితే చంపేస్తానని బెదిరించినట్లు పేర్కొన్నాడు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేసి చాంద్రాయణగుట్టకు, అక్కడి నుండి బండ్లగూడ పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. నాంపల్లిలోని ఫోక్సో కేసుల ప్రత్యేక కోర్టు 12వ ఎఎస్‌జె జడ్జి ఎం.అర్చన కుమారి నిందితుడు సయ్యద్ నదీమ్‌కు 20 ఏళ్ళ కఠిన జైలుశిక్ష, రూ.పదివేల జరిమానాతోపాటు బాధితుడిని బెదిరించినందుకు అదనంగా మరో రెండేళ్ళ జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. నింధితుడికి కఠిన శిక్ష పడటంలో కృషి చేసిన బాలాపూర్, చాంద్రాయణగుట్ట, బండ్లగూడ పోలీసు అధికారులను, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

## పార్కులో గంజాయి సేవిస్తున్న ఏడుగురిపై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, జూలై 3, ప్రభాతవార్తః** విశ్రాంత పోలీసు ఉన్నతాధికారులు నివసించే జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లోని ఒక ఉద్యానవనంలో గంజాయి సేవిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించి ఏడుగురు యువకులపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ప్రశాసన్‌నగర్‌లోని ఉద్యానవనంలో కొందరు యువకుడు గంజాయి సేవిస్తున్నట్లు జూబ్లీహిల్స్ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో టి-నాబ్ బృందంతోపాటు జూబ్లీహిల్స్ పోలీసులు ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు గంజాయికి అలవాటు పడ్డారని, తరచూ ఇదే పార్కులో కలిసి గంజాయి సేవిస్తున్నట్లు అంగీకరించారు. పట్టుబడిన వారిలో యాపా నవీన్ (26), జి. మధు (24), మారేడి ఉపేందర్ (27), పసుపుల మణిశంకర్ (19), వడ్ల అనిల్ కుమార్ (19), సందుల మహేష్ (17), బొల్లి కుమార్ (19)లు ఉన్నారు. విచారణలో ప్రధాన నిందితుడు యాపా నవీన్ నానక్‌రామ్‌గూడలోని స్టార్ ఆస్పత్రి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజా యి కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు. ఈ మేరకు పోలీసులు ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హిట్ అండ్ రన్‌లో ద్విచక్ర వాహనదారుడు మృతి

**పేట్ బషీరాబాద్, జూలై 3, ప్రభాతవార్త** పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 44పై రాజరాజేశ్వరి దేవాలయం సమీపంలో జరిగిన హిట్ అండ్ రన్ రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. కొంపల్లికి చెందిన దోమకొండ చిన్న సాయిలు (37) దేవరాయంజాల్‌లోని రిలయన్స్ గోదాంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనం (టిఎస్17ఏ8294)పై ఇంటికి బయలుదేరాడు. రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో ఎన్‌హెచ్44పై రాజరాజేశ్వరి దేవాలయం వద్ద ఎడమవైపు మలుపు తిరుగుతుండగా, గుర్తుతెలియని వాహనం అతివేగంగా, నిర్లక్ష్యంగా వచ్చి అతని బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్న సాయిలు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వాహనం డ్రైవర్ ఘటన అనంతరం అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య దోమకొండ అనూరాధ ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## రైతులకు ప్రభుత్వ పథకాలపై సమగ్ర అవగాహన



**తుర్కయంజాల్, జులై 3,ప్రభాతవార్త**

అంతర్జాతీయ సహకార వారోత్సవాల సందర్భంగా ఆదిభట్ల సర్కిల్ తొర్రూర్ డివిజన్ తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం సంఘ ప్రధాన కార్యాలయంలో సహకార జెండా ఆవిష్కరణ, రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు, రైతులతో ముఖాముఖి సంభాషణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో హాజరై సహకార రంగం ద్వారా అందుతున్న సేవలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన పొందారు.సంఘ పీఏసీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా సహకార జెండాను ఆవిష్కరించి అంతర్జాతీయ సహకార వారోత్సవాలను ప్రారంభించారు. సత్తయ్య మరియు సతీష్ రవికుమార్ మాట్లాడుతూ, రైతుల ఆర్థికాభివృద్ధికి సహకార సంఘాలు కీలకంగా పనిచేస్తున్నాయని, రైతులకు తక్కువ వడ్డీ రుణాలు, ఎరువులు, విత్తనాలు, పంటల కొనుగోలు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సహకార వ్యవస్థ ప్రధాన పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు ఆర్. విజయ, ఎం. రవికుమార్, కె. శ్రీనివాస్, కె. మనోజ్‌కుమార్, సైదులు, పీఏసీ కమిటీ సభ్యులు సామ సంజీవరెడ్డి, కుతడి నర్సింగ్‌రావు, వంగేటి లక్ష్మారెడ్డి, చాపల యాదగిరి, జక్క కృష్ణారెడ్డి, సామ సత్యనారాయణరెడ్డి, సంఘ కార్యదర్శి వై. రాందాస్, సంఘ సభ్యులు కె. లక్ష్మారెడ్డి, టి. అశోక్ గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు

## దేశాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న ప్రధాని మోడీ

**: ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్**



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న బిజెపి రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, భాగ్యనగర్ జిల్లా ఓబీసీ అధ్యక్షుడు చందు ప్రదీప్ కుమార్ తదితరులు

**మలక్ పేట, జులై 3, ప్రభాతవార్త:**

ప్రధాని మోడీ దేశాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని బిజెపి ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ పేర్కొన్నారు. జాతీయ ఓబీసీ సెల్ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ జన్మదిన పురస్కరించుకుని భాగ్యనగర్ జిల్లా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చందు ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ముసారాంబాగ్ లోని ప్రభుత్వ వృద్ధాశ్రమంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వృద్ధులు, దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ దేశ ప్రజల సంక్షేమం కోసం పలు అభివృద్ధి పథకాలను ప్రవేశపెడుతున్నారని వివరించారు. ప్రధాని మోడీ సారథ్యంలో దేశం సర్వతో ముఖాముఖివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. భాగ్యనగర్ జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చందు ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ భాగ్యనగర్ జిల్లా పరిధిలో బిజెపిని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుభాష్ చందర్ జీ, బొక్క మధుసూదన్ రెడ్డి, రామ్ కోటేశ్వరావు, లింగాలహరి గౌడ్, నరసింహ, గౌర దేవేందర్, వెంకటేష్ గౌడ్, సురేందర్, దినేష్, రాము యాదవ్, దశరథ్, లక్ష్మి పాల్గొన్నారు.

## అంకితభావంతో విధులు నిర్వహించడం అభినందనీయం



పదవి విరమణ చేసిన శివకుమార్‌ను సన్మానిస్తున్న వైస్ చైర్మన్ చౌకి రవికుమార్, సలహాదారుడు వేమూరి విజయకుమార్ తదితరులు

**మలక్ పేట, జులై 3, ప్రభాతవార్త:**

అంకితభావంతో విధులు నిర్వహించడం అభినందనీయమని శ్రీ పోచమ్మ దేవాలయం వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్ లో విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన టీ. శివకుమార్ మలక్ పేట్ లోని శ్రీ పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ ఆధ్వర్యంలో శివకుమార్ కు పుష్పగుచ్ఛలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సలహాదారుడు వేముల విజయకుమార్, రాజేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నా-అక్క మెంటర్‌షిప్ ఇంటర్న్‌షిప్‌కు శ్రీకారం



**నేరేడ్‌మెట్ జులై 3,ప్రభాతవార్త :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అన్నా-అక్క మెంటర్‌షిప్ - కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ టీచింగ్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జిల్లాలోని 21 ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్న్‌షిప్‌ను ప్రారంభించారు .ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బండి రాజు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా పాఠశాల విద్యార్థుల్లో డిజిటల్ పరిజ్ఞానం పెంపొందడంతో పాటు కళాశాల విద్యార్థుల్లో బోధనా నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేసి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.కళాశాల నుంచి ఎంపికైన విద్యార్థులను జిల్లాలోని 21 ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించినట్లు తెలిపారు. వారు పాఠశాల విద్యార్థులకు కృత్రిమ మేధస్సు (ఏఐ), డిజిటల్ అక్షరాస్యత, సాంకేతిక నైపుణ్యాలు, డిజిటల్ లెర్నింగ్ అంశాలపై అవగాహన కల్పించనున్నారు.ఈ కార్యక్రమాన్ని కళాశాల నోడల్ అధికారులు డా. కె. హరిత, జి. స్వాతి, డా. జి. మల్లిక సమన్వయం చేస్తున్నారు. ఇంటర్న్‌షిప్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వారు తెలిపారు.



ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ లో 10 లక్షల తో ఆర్‌సిసి పైప్ లైన్ పనులను మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి,సయ్యద్ అబ్దుల్లా,యాదయ్య, రమణ,శ్రీధర్, రవి,జోగారావు, సుందర్ లాల్,అనీష్, హైమద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు

## కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలే మార్గం : సిపిఐ

**నేరెడ్ మెట్ జులై 3 ,ప్రభాతవార్త :**



ఏఐటీయూసీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నాలుగో మహాసభను ఈ నెల 11న యాప్రాల్‌లోని బాపూజీనగర్ కమిటీ హాల్‌లో ఘనంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని సీపీఐ మల్కాజిగిరి మండల కార్యదర్శి కాసర్ల నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం కాకతీయనగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలోనూ రాష్ట్రంలోనూ కార్మికుల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందన్నారు. గతంలో కార్మిక ఉద్యమాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించి కార్మికుల హక్కులను హరించే విధంగా వ్యవహరించిందని విమర్శించారు. ఈ చట్టాలతో కార్మికులను యాజమాన్యాల ముందు బానిసలుగా నిలబెట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు.మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు, పరిశ్రమలు, ప్రైవేటు విద్యాసంస్థలు, ఆస్పత్రులు, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు, ఆటో రంగం, ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు.సీపీఐ మండల సహాయ కార్యదర్శి కె. అశోక్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కనీస వేతనాలను పెంచడంతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అనంతరం కాకతీయనగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా జే. వెంకటరమణ, అధ్యక్షుడిగా కన్నెగంటి ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా చిలుమూరి ఆనందరావు, కోశాధికారిగా ఎస్.కె. ఖాసిం, ఉపాధ్యక్షుడిగా కె. మాధవ్, సహాయ కార్యదర్శులుగా డి. కిష్టయ్య, వి. వెంకట్రావును ఎన్నుకోగా, మరో 21 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో యు. మాల కొండయ్య, డి. వెంకటేశ్వర్లు, యు. శ్రీను, టి. పేరయ్య, టి. శ్రీను, టి. రమేష్, కె. శ్రీహరి, పి. బాలాజీ, కె. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజ్‌గిరి అభివృద్ధి కోసం హైడ్రా కమిషనర్‌కి ఎమ్మెల్యే మర్రి వినతి



**మల్కాజ్‌గిరి, జులై 3,ప్రభాతవార్త :** మల్కాజ్‌గిరి నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల వేగవంతమైన అమలే లక్ష్యంగా మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే శుక్రవారం హైడ్రా కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పలు కీలక అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా అల్వాల్‌లో ఫైర్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించిన గ్రామకంఠం భూమిపై కొనసాగుతున్న కోర్టు స్టే అంశాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే, ప్రజల భద్రత దృష్ట్యా ఫైర్ స్టేషన్ నిర్మాణ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించేలా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే అదే గ్రామకంఠం ప్రాంతంలో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్న అధికారులపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా అల్వాల్ జొన్నబండ పరిధిలోని యూఎల్సీ భూములు, సర్వే నంబర్లు 582, 583లోని 22తి నిషేధిత జాబితాలో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అదే ప్రాంతంలో నివసిస్తున్న వడ్డెర, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన పేద కుటుంబాలకు జారీ అవుతున్న నోటీసుల అంశాన్ని కూడా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, నిరుపేదలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, మల్కాజ్‌గిరి నియోజకవర్గ ప్రజల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ భూముల సంరక్షణ, అభివృద్ధి పనుల వేగవంతమైన అమలే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే సమర్పించిన వినతులపై హైడ్రా కమిషనర్ సానుకూలంగా స్పందించి, సంబంధిత అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలి : సిపిఎం



**తుర్కయంజాల్, జులై 3,ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడి విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను తక్షణమే కల్పించాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు.శుక్రవారం జీహెచ్‌ఎంసీ ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ పరిధిలోని రాగన్నగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను సీపీఎం బృందం సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించింది. ఈ సందర్భంగా పగడాల యాదయ్య మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దుతున్నామని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు పూర్తిగా భిన్నంగా ఉందని విమర్శించారు.పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా తరగతి గదులు లేవని, ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇప్పటికీ వర్క్‌బుక్స్ అందలేదని, 6వ, 7వ తరగతి విద్యార్థులకు హిందీ, ఇంగ్లీష్ పాఠ్యపుస్తకాలు అందకుండా ఉండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరిస్తేనే ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు పోటీగా నిలుస్తాయని లేకపోతే ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించేందుకు సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు, తుర్కయంజాల్ కార్యదర్శి డి. కిషన్, కమిటీ సభ్యులు ఎం. సత్యనారాయణ, కె. శ్రీరామ్ మూర్తి, పి. శ్రీనివాసులు, కె. వెంకటకృష్ణ, ఐ. భాస్కర్, పార్టీ నాయకులు ఎ. భాస్కర్ రెడ్డి, బి. శంకరయ్య, ఎ. మాధవరెడ్డి, కె. సత్యం, పి. మధు, పి. కృష్ణ, నాగయ్య, నరసింహ, భాస్కర్, కె. జంగయ్య, ప్రవీణ్, అఖిల్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వేణు, మనీ, వంశీ, కార్తీక్, సైదులు, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలు అవ్వాలి: సబితా ఇంద్రారెడ్డి



తలసేమియా చిన్నారుల కోసం రక్తదానం చేస్తున్న మెకానిక్‌లను అభినందిస్తున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, జులై 3 ప్రభాతవార్త:** రోగులకు అత్యవసరమయ్యే రక్తాన్ని దానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ మెకానిక్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం బాలాపూర్ మండలంలోని జిల్లెలగూడ చందన చెరువు కట్టపై తలసేమియా వ్యాధి బాధిత చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సంతోష్‌నగర్, చంపాపేట్ ఆటోమొబైల్స్ అండ్ మెకానిక్స్ టూ వీలర్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎన్‌టిఆర్ ట్రస్ట్ తలసేమియా కేర్ సెంటర్, రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, యుఆర్ ఎంటర్‌ప్రైజెస్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరైన సబితారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదానం చేస్తున్న మెకానిక్‌లతో పాటు పలువురిని ఆమె అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రక్తదానం చేయడం చాలా గొప్ప విషయమని అన్నారు. ప్రాణదానం చేసిన దానితో సమానమైన రక్తదానం చేయడానికి ఆరోగ్యవంతులు ముందుకు రావాలని ఆమె సూచించారు. ఆసుపత్రుల్లో రక్తం అవసరమైన వారికి ఇలాంటి రక్తదాన శిబిరాలు గొప్ప వరమని అన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ప్రత్యేకంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఈ శిబిరంలో రక్తదానం చేసి సమాజానికి స్ఫూర్తిగా నిలిచిన మెకానిక్‌లను, యూనియన్ నాయకులను సబితారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు నరేందర్ యాదవ్, తూళ్ళ హరి బాబుగౌడ్, రమేష్‌రావు, కె.నర్సింహ, విష్ణువర్ధన్‌రెడ్డి, పలువురు మెకానిక్‌లతో పాటు స్థానిక జిల్లెలగూడ, మీర్‌పేట్ బిఆర్‌ఎస్ నాయకులు అర్కల భూపాల్‌రెడ్డి, అర్కల కామేష్‌రెడ్డి, ఎనుగు అనిల్‌యాదవ్, మాదరి రమేష్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జమాల్‌పూర్ సునీత బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి

**రంగారెడ్డి జిల్లా డిప్యూటీ సిఇఓ జయచంద్రారెడ్డి**



ఎస్ఐఆర్ ప్రక్రియలో విధులు నిర్వహిస్తున్న వారికి దిశా నిర్దేశనం చేస్తున్న డిప్యూటీ సిఇఓ జయచంద్రారెడ్డి, ఆర్‌డిఓ జగదీశ్వర్‌రెడ్డిలు

**సరూర్‌నగర్, జులై 3 ప్రభాతవార్త:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా డిప్యూటీ సిఇఓ జయచంద్రారెడ్డి సూచించారు. జీహెచ్‌ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం డిప్యూటీ కమీషనర్ వి.సమ్మయ్య ఆధ్వర్యంలో ఎస్ఐఆర్‌కు సంబంధించి సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన డిప్యూటీ సిఇఓ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో ఉండేలా ఎస్ఐఆర్ ప్రక్రియ సాధ్యం చేయాలని అన్నారు. నిష్పక్ష పాతంగా ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజలు, ప్రజాప్రతి నిధులు, పార్టీల వారు, కాలనీ సంక్షేమ సంఘాలు సహకరించాలని ఆయన కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో విధులు నిర్వహించే వారందరూ సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాగా ఈ సమావేశంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎలా నిర్వహించాలి?, క్షేత్ర స్థాయిలో ఎన్యూమరేషన్ల ఫారాలను తప్పులు లేకుండా ఎలా పూరించాలి? తదిత ర అంశాలపై అధికారులు దిశానిర్దే శనం చేశారు. అదే విధంగా ఇప్పటి వరకు జరిగిన ఈ ప్రక్రియకు సంబంధించి సమావేశానికి హాజరైన వారి నుండి ఫీడ్ బ్యాక్ తీసు కున్నారు. ఈ సమన్వయ సమా వేశంలో కందుకూరు ఆర్డీఓ జగదీశ్వ ర్‌రెడ్డి, బడంగ్‌పేట్ డిసి సమ్మ య్య, బాలాపూర్ డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌లతో పాటు ఎస్ఐఆర్ ప్రక్రియలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది, పలు విభాగాల వారు పాల్గొన్నారు.

## కొత్త విద్యుత్ కేబుల్ వైర్ల ఏర్పాటు

**రామంతాపూర్, జులై 3 ప్రభాతవార్త :** రామంతాపూర్ వెంకట్‌రెడ్డినగర్‌లో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న 11 కెవి విద్యుత్ కేబుల్ సమస్య పరిష్కారం అయినట్లు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం విద్యుత్ తీగల సమస్య పరిష్కారం అయిన సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ తీగల కారణంగా గతంలో ఒకరు మృతి చెందారని, రూ. 30లక్షల వ్యయంతో కొత్త విద్యుత్ కేబుల్ వైర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి సహకారంతో పనులు చేస్తున్నామని తెలిపారు. కాలనీ బస్‌స్టాప్ నుండి గల్లీ కింద ఉన్న గుడిసె హోటల్ వరకు వెళ్తున్న 500 ఫీట్ల 11 కెవి ప్రధాన ఎలక్ట్రిక్ వైర్ల వల్ల ఇక్కడి ప్రజలు నిరంతరం షాక్‌లకు గురవుతూ తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. గతంలో ఇద్దరు ఎమ్మెల్యేలు దీనిని పరిష్కరించలేదన్నారు. కాంగ్రెస్ నాయకత్వంలో చొరవ యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేస్తున్నామన్నారు. దశాబ్దాల నాటి సమస్యను తీర్చి తమ ప్రాణాలకు రక్షణ కల్పించిన సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సహకరించిన విద్యుత్ శాఖ డిఇ సుబ్బారావు, ఎడిఇ రవీందర్, ఎఇలావణ్యకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ప్రధాన కార్య దర్శి జలీల్ పాషా, పలువురు కాంగ్రెస్ సీనియ ర్ నేతలు, మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై అవగాహన పెంచుకోవాలి



పత్రాలను అందజేస్తున్న చిలుక ఉపేందర్‌రెడ్డి

**ఎల్‌బినగర్, జులై 3 ప్రభాతవార్త:**

ఎస్ఐఆర్‌పై ప్రతిఒక్కరు అవగాహన పెంపొందించుకొని తమ ఓటును భద్రపరచుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బిఎల్ఓ సుమలత, మమత, రాంబాబు, సూపర్వైజర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాలను ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రాధాన్యతను గురించి ఉపేందర్‌రెడ్డి ఓటర్లకు వివరించారు. రాజ్యాంగబద్ధంగా మనకు లభించిన ఓటు హక్కు ఎస్ఐఆర్ ద్వారా భద్రపరచుకోవచ్చు అన్నారు.

## బ్రహ్మోత్సవాలలో పుష్పార్చన



పుష్పార్చన చేస్తున్న వేద పండితులు

**ఎల్‌బినగర్, జులై 3 ప్రభాతవార్త:** బ్రహ్మోత్సవాల సందర్భంగా పుష్పార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.గడ్డిఅన్నవరం శ్రీవీరవేంకట సత్యనారాయణస్వామి దేవస్థానంలో 2వ పుష్కర బ్రహ్మోత్సవం కార్యక్రమంలో భాగంగా 4వ రోజు అయిన శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్, రుద్వికులు, వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణ మధ్య భక్తిశ్రద్ధలతో పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా లక్ష్మీనారాయణ హోమము కార్యక్రమాన్ని శాస్త్ర యుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దేవరం లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి చకిలం రమణయ్య, కోశాధికారి వక్కలంక శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షులు పాల్గి శ్రీనివాస్, సంయుక్తకార్యదర్శి భాషపాక సంతోష్, మాజీ చైర్మన్ సూరిశెట్టి వీరేశం, చిదర నాగేందర్, ఊర నరసింహగుప్తా, బచ్చు సత్యనారాయణ, ప్రొద్దుటూరి కుమారస్వామి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చంపాపేటలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ



సామ రమణారెడ్డికి సర్ ఎన్యుమరేషన్ దరఖాస్తును అందజేస్తున్న డిసి శ్రీనివాస్

**సైదాబాద్, జులై 3 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ వార్డు కార్యాలయాన్ని ఎల్‌బినగర్ డిసి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డిలు సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు తమ ఓటు వివరాలు సరిచేసుకుని నమోదు చేయించుకోవాలన్నారు. సర్ ఎన్యుమరేషన్ ఫామ్‌ను పూర్తి చేసి సంబంధిత బిఎల్‌ఓలకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు ఇంఛార్జి శ్రీనివాస్,జవాన్ నర్సింహ, బిఎల్ఓలు,పాల్గొన్నారు.

## మిని ట్యాంక్‌బండ్ వద్ద అభివృద్ధి పనులు ప్రారంభం



మిని ట్యాంక్‌బండ్ వద్ద అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, జులై 3 ప్రభాతవార్త:** రాబోయే వినాయక చవితి పండుగను దృష్టిలో పెట్టుకుని సరూర్‌నగర్ మిని ట్యాంక్‌బండ్ వద్ద చేపడుతున్న అభివృద్ధి పనులను లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం ఇరిగేషన్ శాఖ అధికారులతో కలసి పరిశీలించారు. గణేష్ నిమజ్జనం కోసం ఏర్పాటు చేస్తున్న వ్యూ పాయింట్ పిల్లర్ల పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి నాటికి భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను మిని ట్యాంక్‌బండ్ వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. పనులు వేగంగా చేపడుతూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు ఆయన సూచించారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



ఎర్రకుంట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో చౌలా హరిబాబు తధితరులు

**నాచారం, జులై 3 ప్రభాతవార్త :**

విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తిని పెంపొందించి, వారి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో నాచారంలోని శ్రీ స్వర్ణ హరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎర్రకుంట జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నోట్‌బుక్స్, పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు చౌలా హరిబాబు విద్యార్థులకు స్వయంగా పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విద్యే సమాజాభివృద్ధికి బలమైన పునాది. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జంగం అశోక్, కల్వ యాదగిరి, సి. గిరిబాబు, నర్సింగ్, సుదామల్ల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు తప్పనిసరిగా పత్రాలను వెంట ఉంచుకోవాలి : ఎసిపి రాజా వెంకటరెడ్డి



చాదర్ ఘాట్‌లో ఆపరేషన్ కవచ్ ప్రత్యేక నాకాబందీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎసిపి రాజా వెంకటరెడ్డి, ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి తదితరులు

**మలక్ పేట, జులై 3, ప్రభాతవార్త:**

వాహనదారులు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే పత్రాలను వెంట ఉంచుకోవాలని మలక్ పేట ఎసిపి రాజా వెంకటరెడ్డి పేర్కొన్నారు.నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనల అమలుపై చాదర్ ఘాట్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఖిఆపరేషన్ కవచ్‌ఖి నాకభంది కార్యక్రమాన్ని నిర్వహించి భారీ సంఖ్యలో నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు చార్మినార్ జోన్ డీసీపీ పర్యవేక్షణలో మలక్‌పేట్ ఏసీపీ ఎల్. రాజా వెంకట్ రెడ్డి, చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి ల ఆధ్వర్యంలో చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఖిఆపరేషన్ కవచ్‌ఖి ప్రత్యేక నాకాబందీ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ తనిఖీల్లో మొత్తం 109 వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని,వాటిలో 108 ద్విచక్ర వాహనాలు, ఒక నాలుగు చక్రాల వాహనం ఉన్నాయని వివరించారు. నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న 36 వాహనాలు, నిబంధనలకు విరుద్ధమైన నంబర్ ప్లేట్లతో ఉన్న 45 వాహనాలు, సరైన వాహన పత్రాలు లేని 27 వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. వాహనదారులు నిబంధనలకు అనుగుణమైన నంబర్ ప్లేట్లను అమర్చుకోవాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించి గమ్యస్థానాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మలక్ పేట ఇన్ స్పెక్టర్ కుంభం నరసింహ, పలువురు ఎస్ఐ లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన ఆత్మీయ మహిళా మండలి ప్రాంగణం



తార్నాకలో అయోధ్య శ్రీరామ పాదుకల దర్శనం

**తార్నాక, జులై 3 ప్రభాతవార్త** : అయోధ్య శ్రీరాముని పవిత్ర పాదుకలు, బాల అయోధ్య రాముడు, శ్రీరాముని ధనస్సు తార్నాకలోని ఆత్మీయ మహిళా మండలి ప్రాంగణానికి చేరుకోవడంతో ఆ ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. చల్లా శ్రీనివాస శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేదమంత్రోచ్చారణల నడుమ శ్రీరామ పాదుకలకు విశేష పూజలు, హారతులు నిర్వహించగా ఆలయ ప్రాంగణం భక్తిరసంతో మార్మోగింది. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు శ్రీరాముని ఆశీస్సులు పొందుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అయోధ్య నుంచి తీసుకొచ్చిన పవిత్ర పాదుకల దర్శనం కల్పించడం జీవితంలో అరుదైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సదంర్భంగా నిర్వాహకులు చల్లా శ్రీనివాస శాస్త్రి, ఆత్మీయ మహిళా మండలి అధ్యక్షురాలు,కవయిత్రి డా. లక్కరాజు నిర్మల, కొండపల్లి నరిసింహ్మారావు మాట్లాడుతూ శ్రీరామ భక్తి సనాతన ధర్మ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లో విస్తరింపజేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం విజయవంతానికి సహకరించిన భక్తులు, సేవా బృంద సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి





రాష్ట్ర డిజిపి సివి ఆనంద్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**రామంతాపూర్, జులై 3 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్‌కు ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రాష్ట్ర డిజిపి సివి ఆనంద్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రామంతాపూర్ డివిజన్‌లో సుమారు లక్ష మంది జనాభా నివసిస్తున్నారని, ప్రస్తుతం ఈ ప్రాంతం ఉప్పల్ పోలీస్ స్టేషన్, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఉండటంతో సమర్థవంతమైన పోలీసింగ్ నిర్వహించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అదే విధంగా హబ్సిగూడ పరిధిని రామంతాపూర్‌కు మార్చాలని విన్నవించారు. విస్తారమైన భౌగోళిక పరిధి, పెరుగుతున్న జనాభా, మాదకద్రవ్యాల కార్యకలాపాలు మరియు సంఘవ్యతిరేక శక్తుల నియంత్రణకు ప్రత్యేక పోలీస్ స్టేషన్ అవసరం ఎంతో ఉందని తెలిపారు.రామంతాపూర్ డివిజన్‌కు ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తే నేర నియంత్రణ, నిఘా వ్యవస్థ బలోపేతం కావ డంతో పాటు ప్రజలకు మరింత భద్రత కల్పించవచ్చని పేర్కొ న్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి, త్వరితగతిన కొత్త పోలీస్ స్టేషన్‌ను మంజూరు చేయాలని కోరారు.దీనిపై డిజిపి సానుకూలంగా స్పందించారని తెలిపారు.కార్యక్రమంలో పలువురు బిఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

## ఎంపి వేం నరేందర్‌రెడ్డితో కాంగ్రెస్ పార్టీ నేతల బేటి



వేం నరేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న వజ్రేష్ యాదవ్, మైనంపల్లి, ఎం.వరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్, జులై 3 ప్రభాతవార్త :** రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డితో శుక్రవారం పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు బేటి అయ్యారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మల్కాజిగిరి, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జ్‌లు మైనంపల్లి హనుమంతరావు, మందుముల పరమేశ్వర్ రెడ్డి తదితరులు కలిసి ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతాపూర్ చిన్న చెరువు, నాచారం పటేల్ కుంట చెరువుల అభివృద్ధి పనులకు నిధులు పెంచాలని కోరారు. ఇప్పటికే కేటాయించిన అరకొర నిధులతో ఈ రెండు చెరువుల లో అభివృద్ధి, సుందరీకరణ పనులకు సరిపోవన్నారు.ఉప్పల్ నియోజకవర్గంలో చెరువుల అభివృద్ధికి, సుందరీకరణ పనులకు సుమారు రూ.100 కోట్లకు పైగా నిధులను కేటాయించడంతో పనులు ప్రారంభం అయినట్టుగా చెప్పారు. కానీ, రామంతా పూర్ చిన్న చెరువు, నాచారం పటేల్ కుంట చెరువులకు అన్ని రకాల సౌకర్యాలు చేపట్టేలా సరిపడా నిధుల కేటాయింపు జరు గలేదన్నారు. వెంటనే సరిపడా నిధుల కేటాయింపుతో పాటు సకాలంలో పనులను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.దీనిపై వేం నరేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు.